వీణవంకలో 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరీంనగర్ జిల్లా వీణవంకలో రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వీణవంక మండలంలో 45.8 డిగ్రీలకు పైగా గరిష్ట ఉషోగ్రతలు నమోదైనట్టు వాతావరణ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. అలాగే, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పెద్దపల్లి జిల్లా మంథని, పెద్దపల్లి జగిత్యాల జిల్లా సారంగపూర్, ధర్మపురి మండలంలోని జైనలో సైతం 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నమోదైన ఉష్ణోగ్రతల్లోకెల్లా మంథనిలో 45 డిగ్రీలకు పైగా ఉండటంతో ఆ ప్రాంతాలను రెడ్ అలర్ట్‌గా ప్రకటించనున్నారు. ఎండ తీవ్రత మరి కొద్ది రోజులు పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఎండవేడిమితో జనం అల్లాడిపోయారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని అధికారులు, వైద్యులు సూచిస్తున్నారు.

ఈ నెల 17న బిఆర్‌ఎస్‌ఎల్‌పి సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్ పార్టీ కీలక సమావేశాన్ని మే 17న (బుధవారం) నిర్వహించనున్నది. బిఆర్‌ఎస్ అధినేత, సిఎం కెసిఆర్ అధ్యక్షతన పార్టీ శాసన సభాపక్షం, పార్లమెంటరీ పార్టీ సమావేశం కానున్నాయి. ఈ సమావేశానికి బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు హాజరు కానున్నారు. తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలను పార్టీ శ్రేణులు ఘనంగా జరిపేలా.. ఆ సమావేశంలో కెసిఆర్ దిశా నిర్దేశం చేయనున్నారు. కర్ణాటక ఎన్నికల ఫలితాలపై చర్చించే అవకాశం ఉంది. నవంబర్ లేదా డిసెంబర్ నెలలో ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున ఎన్నికల రోడ్ మ్యాప్‌పై చర్చించవచ్చని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

IN THE HONOURABLE COURT OF THE
IV SENIOR CIVIL JUDGE
CITY CIVIL COURT AT: HYDERABAD
O.S No. 785 OF 2018
Between:
ICICI Bank LIMITED ...Plaintiff
AND
Kamala Shri Poly Sacks
...Defendant
To
1.Kamala Shri Poly Sacks
Rep by its Proprietor
Dinesh Kumar Mantri
S/o Srinivas Mantri, Aged Major
#Plot 745, Aruna Complex
Subash Nagar Jeedimetla
RR dist Hyderabad. ....Defendant
Whereas the above named plaintiff filed suit against the defendants for Recovery of Claim and the same is posted to 09-06-2023 at 10-30 A.M for your appearance. You are hereby directed by the Hon'ble Court to appear before the said Court on the date and time mentioned above. Otherwise the matter will be heard on your absence.
//BY ORDER OF THE COURT//
B. PRAVEEN KUMAR
Advocate

IN THE HONOURABLE COURT OF THE
II JUNIOR CIVIL JUDGE
CITY CIVIL COURT AT: HYDERABAD
O.S No. 1555 OF 2018
Between:
ICICI Bank LIMITED ...Plaintiff
AND
Komma Rajesh Reddy
...Defendant
To
Komma Rajesh Reddy
S/o Komma Bhanu Deva Reddy
Age Major, Occ: Private Employee
Flat No 201,Plot 32,
Gopi Krishna Residency
Balaji Hills, Nizampet Vill
Qutubullapur, RR dt -90
....Defendant
Whereas the above named plaintiff filed suit against the defendants for Recovery of Claim and the same is posted to 12-06-2023 at 10-30 A.M for your appearance. You are hereby directed by the Hon'ble Court to appear before the said Court on the date and time mentioned above. Otherwise the matter will be heard on your absence.
//BY ORDER OF THE COURT//
B. PRAVEEN KUMAR
Advocate

IN THE HONOURABLE COURT OF THE
II SENIOR CIVIL JUDGE
CITY CIVIL COURT AT: HYDERABAD
O.S No. 1566 OF 2018
Between:
ICICI Bank LIMITED
...Plaintiff
AND
Manoj Kumar
...Defendant
To
Manoj Kumar
S/o Jaglal Prasad
H No 2-63/3/B/73, 2nd Floor,
Plot No 73, Megha Hills,
Madhapur, Hyderabad-81
....Defendant
Whereas the above named plaintiff filed suit against the defendants for Recovery of Claim and the same is posted to 09-06-2023 at 10-30 A.M for your appearance. You are hereby directed by the Hon'ble Court to appear before the said Court on the date and time mentioned above. Otherwise the matter will be heard on your absence.
//BY ORDER OF THE COURT//
B. PRAVEEN KUMAR
Advocate

నిరుద్యోగులను మోసం చేసిందే బిజెపి..

- తొమ్మిదేళ్లలో 18 కోట్ల ఉద్యోగాలు ఏవీ..?
- బిజెపి నాయకులకు దమ్ముంటే మోడీపై నిరుద్యోగ మార్చ్ చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వ సుస్థిరపాలనతో పెట్టుబడుల వెల్లువ
- రాబోయే ఎన్నికల్లో వంద సీట్లతో హ్యాట్రిక్ పక్కా
- ఫ్యాక్స్‌కాన్ కంపెనీతో 40 వేల మందికి ఉపాధి
- ఐటి, మున్సిపల్ శాఖ మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, తొమ్మిదేళ్లలో 18 కోట్ల ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేసిందని, రాష్ట్రంలో నిరుద్యోగ మార్చ్ చేస్తున్న బిజెపి నాయకులు దమ్ముంటే మోడీపై నిరుద్యోగ మార్చ్ చేయాలని ఐటి, మున్సిపల్ శాఖ మంత్రి కెటిఆర్ సవాల్ విసిరారు. పేపర్లు లీక్ చేసి విద్యార్థులు, యువతను ఇబ్బందులకు గురి చేసిన పార్టీ బిజెపి అని విమర్శించారు. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయంటే సుస్థిరమైన ప్రభుత్వం సమర్థవంతమైన నాయకత్వమని వచ్చినట్టని, వచ్చే ఎన్నికల్లో వంద సీట్లతో సిఎం కెసిఆర్ హ్యాట్రిక్ కొట్టనున్నట్టు దీమా వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా కొంగర కాలన్ గ్రామంలో సోమవారం 'ఫాక్స్‌కాన్ కంపెనీ'కి విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి కెటిఆర్ శంకుస్థాపన చేశారు. అనంతరం బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, ఇబ్రహీంటప్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని కెటిఆర్ మాట్లాడారు. ఫాక్స్ కాన్ కంపెనీ తెలంగాణలో పెట్టుబడి పెట్టించేందుకు మార్చి రెండున సిఎం కెసిఆర్ ఆధ్వర్యంలో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు. రెండున్నర నెలల్లో ప్లాంట్‌కు భూమి పూజ నిర్వహించడం సంతోషకరమైన విషయం అన్నారు. ఫాక్స్ కాన్ కంపెనీ దేశంలోని పలు రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది కానీ తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాల్లో ఉన్నంత వేగం, పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పించాలన్న నిబద్ధత ఇంకెక్కడ చూడలేదని ఫాక్స్‌కాన్ ప్రతినిధి బృందం చెప్పడం గర్వంగా ఉందన్నారు. తొమ్మిదేళ్లలో దేశ విదేశాలకు తిరిగి పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకువచ్చి లక్షలాది ఉద్యోగాలు కల్పించినట్టు తెలిపారు. ఫాక్స్ కాన్ కంపెనీతో 35 నుంచి 40 వేల ఉద్యోగాలు వస్తాయని, మొత్తంగా లక్ష మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి దొరుకుతుందని వివరించారు. ఇందులో ఉద్యోగాలు స్థానికులకే దక్కాలన్న ఉద్దేశంతో నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను మంత్రి సబితా ఇంద్రారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకొని వెంటనే ప్రారంభమయ్యేలా చూడాలని సూచించారు. రాష్ట్రంలో సంపద సృష్టికి, ఉద్యోగ ఉపాధి కల్పనకు తెలంగాణ ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున కృషి చేస్తుంటే.. ప్రతిపక్ష పార్టీలు మాత్రం విచిత్రంగా ప్రవర్తిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధిని ఓర్వలేని దౌర్భాగ్యపు ప్రతిపక్షాలు కేవలం తెలంగాణలోనే ఉన్నాయన్నారు. తమ ప్రభుత్వం అన్ని రంగాలను, అన్ని వర్గాలను కలుపుకొని సంక్షేమమే ఎజెండాగా ముందుకు పోతుందన్నారు. రాష్ట్రం వ్యవసాయం నుంచి ఐటీ దాకా అన్ని రంగాల్లో అగ్రపథాన దూసుకుపోతుందన్నారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి కావస్తుందన్నారు. మూడు, నాలుగేళ్లలో కొంగర కలాన్, మహేశ్వరం ప్రాంతాలు ప్రగతి బాట పట్టాయని తెలిపారు. 'రజనీకాంత్ లాంటి వ్యక్తులు హైదరాబాద్ న్యూయార్క్ నగరంలా మారిందని ఊరికే అనలేదని, నగరం అద్భుతంగా అభివృద్ధి చెందిందని గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో తమ పార్టీ వంద సీట్లు గెలిచి హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్‌కాన్ కంపెనీ ప్రతినిధులు, బిఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 102 డయాలసిస్ సెంటర్లు

- పట్నంతో అవసరమే లేకుండా చేశాం : మంత్రి ట్వీట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డయాలసిస్ సేవల కోసం హైదరాబాద్‌కే వెళ్లాలనే పరిస్థితులకు చరమగీతం పాడామని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు.

ఈ మేరకు సోమవారం ఆయన ట్వీట్ చేశారు. డయాలసిస్ సెంటర్లను మూడు నుంచి 102కు పెంచామని గుర్తుచేశారు. సిర్పూర్ కాగజ్ నగర్, ఏటూరు నాగారం వంటి మారుమూల ప్రాంతాలకు సైతం డయాలసిస్ సేవలందుతున్నాయని తెలిపారు. ఇన్ఫెక్షన్లు సోకకుండా దేశంలోనే తొలిసారిగా సింగిల్ యూజ్ డయలైజర్ పద్ధతి అనుసరిస్తున్నామని, రోగులపై ఆర్థిక భారం పడకుండా ఆసరా పింఛన్, ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించామని తెలిపారు.

వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించండి

- సిఎం కెసిఆర్‌కు తమ్మినేని లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు సోమవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో 2,100 ఖాళీలున్నప్పటికీ 1,335 మంది అధ్యాపకులు మాత్రమే పనిచేస్తున్నారని తెలిపారు. 1,335 మంది కాంట్రాక్టు అధ్యాపకులు 25 ఏళ్ల నుంచి విధుల్లో ఉన్నారని వివరించారు. 2015లో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఓ నెంబర్ 16 ప్రకారం వారికి తగిన అర్హతలున్నప్పటికీ నేటికీ ఆ దిశగా అవసరమైన చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. కొంతమేరకు ధ్రువపత్రాల పరిశీలన పూర్తిచేసినప్పటికీ రెగ్యులరైజేషన్ ప్రక్రియను ప్రభుత్వం పెండింగ్‌లోనే ఉంచిందని తెలిపారు. జిఓ నెంబర్ 16 ప్రకారం డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లోని కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసిందని గుర్తు చేశారు. కానీ, అదే తరహాలో అర్హులైన విశ్వవిద్యాలయాల కాంట్రాక్టు అధ్యాపకుల సమస్య పరిష్కారం కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉన్నత విద్యాభివృద్ధికి, విద్యార్థులను తీర్చిదిద్దడంలోను, పరిశోధనారంగంలోను వారు ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. కావున రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను తక్షణమే క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నిలువ నీడ.. తాగేందుకు నీళ్లు లేవు..!

- ఎండ తీవ్రతకు అల్లాడుతున్న 'ఉపాధి' కూలీలు
- కేంద్రం విధానంతో ఇబ్బందులు
- పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కరువు
- మౌలిక వసతులపై దృష్టిసారించని యంత్రాంగం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కాసేపు సేద తీరేందుకు నీడ.. తాగేందుకు నీళ్లు ఉండటం లేదు. పెరుగుతున్న ఎండ తీవ్రతతో కూలీలు అల్లాడుతున్నారు. కొందరు అస్వస్థతకు గురవుతున్నారు. ఇళ్ల నుంచే తాగునీరు పట్టుకెళ్లాల్సిన దుస్థితి. అవి అయిపోతే దప్పికతో ఇబ్బందులు పడాల్సిందే. కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కూలీలు పని చేసే ప్రాంతాలవైపు కనీసం కన్నెత్తి చూడటం లేదు. కొలతల్లో తేడాలుంటున్నాయని డబ్బుల్లో కోత విధిస్తున్న అధికారులు.. చట్టపరంగా వారికి కల్పించాల్సిన సౌకర్యాలపై మాత్రం దృష్టిసారించడం లేదు. ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది ఉపాధి కూలీలు వడదెబ్బ బారినపడుతున్నారు. ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురైతే ప్రాథమిక వైద్యం కూడా అందని పరిస్థితి. వేసవి కావడంతో ఉపాధిహామీలు పనులు ఊపందుకున్నాయి. మరోపక్క కేంద్రం ఇటీవల తీసుకొచ్చిన నూతన నిబంధనల ప్రకారం ఉదయం, సాయంత్రం రెండు సార్లు కూలీల ఫొటోలు తీసుకొని యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి వస్తోంది. అలా అయితేనే కూలీలకు రోజువారీ పూర్తి వేతనం అందుతుంది. దీంతో కూలీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు పని ప్రదేశంలోనే ఉండాల్సి వస్తోంది. ఈ క్రమంలో తప్పనిసరిగా ఆయా ప్రదేశాల్లో తాగునీరు, నీడ కోసం టెంట్, ప్రాథమిక చికిత్స పెట్టే తదితర సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలనే నిబంధనలు ఉన్నాయి. ఈ సౌకర్యాలను కల్పించేందుకు ప్రత్యేకంగా మెట్‌లకు బాధ్యతలు అప్పగించేవారు. రెండేళ్ల కిందట కొంత వరకు ఈ సౌకర్యాలు బాగానే అమలైనా.. క్రమక్రమంగా ఈ చట్టానికి కేంద్రం నిధుల్లో కోతలు విధించుకుంటూ పోతుండడంతో.. సౌకర్యాలు కుచించుకుపోతున్నాయి. పర్యవేక్షించాల్సిన గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పట్టించుకోకపోవడం.. ఉన్నతాధికారులూ దృష్టి సారించకపోవడం మూలంగా కూలీలు అవస్థలు పడుతున్నారు.

పిట్టల్లా రాలుతున్న కూలీలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎండలు ఉగ్రరూపం దాల్చుతున్నాయి. రాష్ట్రంలోనే జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ క్రమంలో ఉపాధిహామీ పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. మంచిర్యాల, కుమురంభీం, ఆదిలాబాద్ జిల్లాలో 45 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జనం ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఉంది. ఈ తరుణంలో రోజువారీ కూలీ పనులు చేసుకొని జీవించే పేదలకు ఉపాధిహామీ పనులే కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాయి. ఎండ తీవ్రత ఉన్నప్పటికీ పనికి వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ క్రమంలో ఇప్పటి వరకు సుమారు ఐదు నుంచి పది మంది వరకు వడదెబ్బ కారణంగా మృతిచెందారు. రెండు రోజుల కిందట ఉట్నూర్‌కు చెందిన సురేష్ ఉపాధిహామీ పనులకు వెళ్లి ఇంటికి తిరిగిరాగానే అస్వస్థతకు గురై మృతిచెందాడు. ఇప్పటికే ఆయా మండలాల్లో పలువురు మరణించిన సంఘటనలు ఉన్నాయి. ఎండలో పనిచేస్తూ అనేక మంది అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

నిలిచిపోయిన అదనపు భత్యం..!

ఉపాధిహామీ పనుల కోసం అవసరమైన పరికరాలను ప్రభుత్వం ఇది వరకు సరఫరా చేసింది. గడ్డపారలు, పారలు, ఇనుప తట్టలు, గొడ్డళ్లు, కొడవళ్లను సైతం అందించింది. క్రమంగా వాటి సరఫరా నిలిపివేయడంతో కూలీలే సొంతంగా ఆయా పరికరాలను సమకూర్చుకుంటున్నారు. తాగునీటి కోసం గతంలో కూలీలకు రూ. ఐదు చెల్లించేవారు. ఏప్రిల్, మే నెలల్లో ఎండల్లో పనిచేసే కూలీలకు 20శాతం అదనపు భత్యం కూడా చెల్లించేవారు. కానీ కేంద్రం ఇటీవల నూతన సవరణలు తీసుకొచ్చి ఈ రెండు ప్రయోజనాలను నిలిపివేసింది. దీంతో కనీస సౌకర్యాలు లేకపోవడం.. ప్రయోజనాలు దూరం కావడంతో కూలీలు సైతం పనులకు వెళ్లేందుకు అయిష్టత వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇదే ఉపాధి కూలీల సంఖ్య తగ్గుముఖం పట్టేందుకు కారణమవుతోంది.

ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు
కేంద్రె గజానంద్, తాడిహత్నూర్

ఉపాధిహామీ పని ప్రదేశంలో ఎలాంటి సౌకర్యాలూ కల్పించడం లేదు. ఉదయం పనులకు వెళ్తే సుమారు నాలుగు గంటలు ఎండలోనే పనిచేయాల్సి వస్తోంది. తాగునీరు, టెంట్, ప్రాథమిక చికిత్స పెట్టే కూడా ఉండటం లేదు. ఇంటి నుంచే తాగునీటిని తీసుకెళ్తున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి.

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు పెట్టండి

- పాండు హత్యపై సిటీ పోలీసులకు జాతీయ ఎస్‌సి కమిషన్ అదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో లాలాపేటకు చెందిన పాండు హత్య కేసులో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసు ఎందుకు నమోదు చేయలేదని సిటీ పోలీసులను జాతీయ ఎస్సీ కమిషన్ వైస్ చైర్మెన్ డాక్టర్ అరణ్ హలార్ నిలదీశారు. సోమవారం హైదరాబాద్‌లోని దిల్‌ఖుష్ గెస్ట్ హౌస్‌లో పలు ఎస్‌సి కేసులను విచారించారు. ఈ సందర్భంగా మొదటి కేసుగా పాండు హత్య కేసును దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. కమిషన్ వైస్ చైర్మెన్ స్పందిస్తూ హత్య కేసులో ఎందుకు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. వెంటనే ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసు నమోదు చేయాలని ఆదేశించారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందించాలని అధికారులను ఆదేశించారు.

బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలి

- మహిళా, యువజన సంఘాల నిరసన
- సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంతో దర్యాప్తు జరపాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళా రెజ్లర్ల పై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని మహిళా యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఉన్న అంబేద్కర్ విగ్రహం ముందు సోమవారం నిరసన తెలిపాయి. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, పిఒడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు వి సంధ్య, చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ పి జ్యోతి, పిఒడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు డి స్వరూప, ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి ఎన్ జ్యోతి మాట్లాడుతూ అంతర్జాతీయ క్రీడల్లో తలపడి వివిధ పథకాలు సాధించి, దేశానికి కీర్తి తెచ్చిన మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు బిజెపి ఎంపి పాల్పడితే, నెల రోజుల నుంచి దీనిపై ఆందోళన జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం ఎందుకు నోరుమెదపటం లేదని ప్రశ్నించారు. లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రెజ్లర్లపై లైంగిక వేధింపు ఘటనపై సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. బ్రిజ్‌భూషణ్‌ను రాజకీయ, ప్రభుత్వ పదవుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మేరీకోమ్ నివేదికను ఎందుకు బహిర్గతం చేయటం లేదో చెప్పాలని ప్రశ్నించారు. పేద మహిళా క్రీడాకారులను ప్రోత్సహించి, వారికి శిక్షణ కోసం సురక్షితమైన పరిస్థితులను ప్రభుత్వం కల్పించాల్సిన అవసముందన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, పివైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ ప్రదీప్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంధర్, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి, ఉపాధ్యక్షులు ఆశాలత, ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు నాయకులు పోటు కళావతి, పిఒడబ్ల్యు నాయకులు వరలక్ష్మి, లక్ష్మిబాయి, సరళ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి బాధితుల పరిహారం విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతీయ ఎస్‌సి కమిషన్ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం తలొగ్గి ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ బాధితుల పరిహారాన్ని ఇచ్చేందుకు ఒప్పుకున్నదని మాల సంక్షేమ సంఘం అధ్యక్షులు బత్తుల రాంప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల ఎనిమిదిన జాతీయ ఎస్‌సి కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో వారు వెంటనే స్పందించారని తలిపారు.ఈ మేరకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జతో మాట్లాడినట్టు పేర్కొన్నారు. దీంతో రెండు మూడు రోజుల్లో ఆర్థిక శాఖ అధికారులతో మాట్లాడి నిధులు విడుదల చేయిస్తామంటూ హామీ ఇచ్చారని తెలిపారు. 11న 33జిల్లాలకు రూ.4 కోట్లు పంపటానికి ప్రెసిడెంట్ కాపీలు జారీ చేసినట్టు తెలిపారు. సోమవారం జాతీయ ఎస్‌సి కమిషన్ వైస్ చైర్మెన్ అరుణ్ హల్దార్‌కు మిగతా నిధులను ఏడు రోజుల్లో అందిస్తామంటూ అధికారులు తెలిపినట్టు రాంప్రసాద్ పేర్కొన్నారు.

విఒఎల సమస్యల్ని పరిష్కరించాలి

- న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తుంటే పట్టదా?
- రాష్ట్ర సర్కారు వెంటనే జోక్యం చేసుకోవాలి :సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఐకెపి విఒఎల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్, తెలంగాణ ఐకెపి విఒఎ ఉద్యోగుల సంఘం (సిఐటియు అనుబంధం) రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌వి రమ, ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె రాజ్‌కుమార్, ఎం నగేశ్, సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు వై సోమన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం హైదరాబాద్‌లోని సెర్ప్ కార్యాలయంలో డైరెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఏప్రిల్ 17 నుంచి నిరవధికంగా జరుగుతున్న విఒఎల సమ్మెలో ప్రభుత్వం జోక్యం చేసుకుని వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. గ్రామాల్లో మహిళలు అభ్యున్నతికి పాల్పడటంతో పాటు అనేక సంక్షేమ పథకాల అమలులో విఒఎలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అలాంటి వారిపట్ల రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించడం తగదని హితవు పలికారు. విఒఎలను వెంటనే సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి రూ.26 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారికి రూ.పది లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. వారికి సెర్ప్ నుంచి ఐడీ కార్డులివ్వాలన్నారు. గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతి నెలా వేతనాలు విఒఎల వ్యక్తిగత ఖాతాలకు చెల్లించాలన్నారు. జాబ్‌చార్టుతో సంబంధం లేని ఆన్‌లైన్ పనులు చేయించొద్దని డిమాండ్ చేశారు. విఒఎలపై మహిళా సంఘాల ఒత్తిడి ఎక్కువగా ఉన్నందున ఎస్‌హెచ్‌జిలకు విఎల్ఆర్, అభయహస్తం డబ్బులు చెల్లించాలని కోరారు. ఎస్‌హెచ్‌జి, విఎ లైవ్ మీటింగ్‌లను రద్దు చేయాలని, అర్హులైన విఒఎలకు సిసిలుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు.

సిఎస్‌తో చర్చిస్తున్న మనోజ్ అహూజా

సిఎస్‌తో కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి మనోజ్ అహూజా సచివాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జూన్ 15-17 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న జీ-20 అంతర్జాతీయ శిఖరాగ్ర సదస్సు ముందస్తు ఏర్పాట్ల సమీక్ష కోసం వచ్చిన మనోజ్ అహూజా, జాయింట్ సెక్రటరీ యోగితారాణాలను సిఎస్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు, పెద్ద ఎత్తున పెరిగిన వ్యవసాయోత్పత్తుల తదితర వివరాలను మనోజ్ అహూజాకు శాంతికుమారి వివరించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు పాల్గొన్నారు.

గ్రూప్ సీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ విభాగాల్లో ఉన్న లోయర్ డివిజన్ క్లర్క్, జూనియర్ సెక్రటరియేట్ అసిస్టెంట్, డాటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు సోమవారం స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఒక ప్రకటన విడుదల చేసింది. అర్హత, ఫీజు చెల్లింపు తదితర వివరాల కోసం కమిషన్ వెబ్‌సైట్‌లో చూడొచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తులకు జూన్ ఎనిమిది వరకు గడువుండగా, అదే నెల పది వరకు ఫీజు చెల్లించవచ్చు.

రేపే పాలిసెట్

- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్ రాతపరీక్ష బుధవారం జరగనుంది. ఇందుకు సంబంధించి అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ మేరకు రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణా మండలి (ఎస్‌బీటీఈటీ) కార్యదర్శి డాక్టర్ సి శ్రీనాథ్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు ఈ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తామని తెలిపారు. దీని ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సులతోపాటు వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలను కల్పిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 296 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. 58,468 మంది అబ్బాయిలు, 47,188 మంది అమ్మాయిలు కలిపి మొత్తం 1,05,656 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేశారని వివరించారు. పాలిసెట్‌కు హాజరయ్యే అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందునుంచే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉండబోదని స్పష్టం చేశారు. అభ్యర్థులు వారి వెంట హెచ్‌బీ బ్లాక్ పెన్సిల్, ఎరేసర్, బ్లూ లేదా బ్లాక్ పెన్ తీసుకుని రావాలనీ, హాల్‌టికెట్ మీద ఫొటో ముద్రించని వారు ఒక పాస్‌పోర్టు సైజు ఫొటో, ఆధార్ కార్డును వెంట తెచ్చుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి ఉండబోదని స్పష్టం చేశారు.

నేటినుంచి మోడల్ స్కూళ్లలో ఇంటర్ ప్రవేశాలు

- ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో ఇంటర్ ప్రవేశాలకు మంగళవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు మోడల్ స్కూళ్ల అదనపు సంచాలకులు సిహెచ్ రమణకుమార్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు అర్హులని తెలిపారు. విద్యార్థులకు ఉచిత విద్యనందిస్తున్నామని పేర్కొన్నారు. ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సిఇసి కోర్సుల్లో ఒక్కో గ్రూపులో 40 సీట్ల చొప్పున ఉంటాయని వివరించారు. మంగళవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. వాటి సమర్పణకు తుది గడువు ఈనెల 25వ తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. పూర్తి షెడ్యూల్‌తోపాటు సమాచారం కోసం www.tsmodelschools.com వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

నమ్మిన ప్రజలను నట్టేట ముంచిన ఎపి సిఎం జగన్

- బిఆర్‌ఎస్ ఎపి అధ్యక్షులు డాక్టర్ తోట చంద్రశేఖర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎపి సిఎం జగన్ తనను నమ్మిన ప్రజలను నట్టేట ముంచారని, వైసిపి పాలన అవినీతిమయమైందని బిఆర్‌ఎస్ ఎపి అధ్యక్షులు డాక్టర్ తోట చంద్రశేఖర్ విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని బిఆర్‌ఎస్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తోట మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక, గంజాయి మాఫియా పెట్రేగిపోతున్నదనీ, వైకాపా నాయకుల ప్రోద్బలంతో రాష్ట్రంలో గంజాయి విచ్చలవిడిగా లభ్యమౌతున్నదని తెలిపారు. అధికార పార్టీ నేతల కనుసన్నల్లో గంజాయి వ్యాపారం మూడు పూలు ఆరు కాయలుగా విలసిల్లుతోందని ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేనన్ని మద్యం బ్రాండ్లు ఎపిలో దొరుకుతాయన్నాయని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం కల్తీ మద్యాన్ని విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ ఖజానా నింపుకునేందుకు వైసీపీ పెద్దలు ప్రజల ప్రాణాలను ఫణంగా పెడతారా? అని ప్రశ్నించారు. ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తామని అధికారం చేపట్టిన వైకాపా ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో బిఆర్‌ఎస్ కీలకపాత్ర పోషించనుందని స్పష్టం చేశారు. తొలుత పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గానికి చెందిన నాయకుడు ఎపి నాయుడు ఆధ్వర్యంలో డి సైదావలి, పలు జిల్లాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తోట సమక్షంలో బిఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.

వెయ్యి ఇళ్లు నేలమట్టం

- ఎనిమిదేళ్లుగా స్థలాల క్రయవిక్రయాలు
- కొనుక్కున్న స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలు
- ఇంటి నెంబర్ ఇచ్చి పన్ను వసూలు చేసిన గ్రామ పంచాయతీలు
- ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలేసి ఇంటికి మీటర్లు పెట్టిన విద్యుత్ శాఖ
- ఐలాపురం, ఐలాపురం తండాలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామ పంచాయతీ నుంచి ఇంటి నెంబర్లు ఇచ్చారు. ప్రజలు ఇంటి పన్నూ చెల్లిస్తున్నారు. విద్యుత్ శాఖ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలేసింది. దరఖాస్తు చేసుకున్న వాళ్లకు ఇంటి మీటర్లు ఇచ్చారు. కాలనీల్లో రోడ్లు వేశారు. గుడి నిర్మాణానికి ప్రజా ప్రతినిధులు శంకుస్థాపన చేశారు. అసైన్డ్ భూమిని వెంచర్లు చేసి ప్లాట్లు అమ్మే సంగతి పంచాయతీ కార్యదర్శి, విఆఒ, విఆర్ఎలకే కాదు సర్పంచ్, రెవెన్యూ అధికారులు, పోలీసులు, ఎమ్మెల్యే వరకు అందరికీ తెలుసు. ఎనిమిదేళ్లు కావస్తున్నా ఏనాడు అడ్డుకోని అధికార యంత్రాంగం చీకట్లో వచ్చి ఇళ్లను నేలమట్టం చేసింది. దాంతో ప్లాట్‌కొని ఇళ్లు కట్టుకున్న వేలాది మంది రోడ్డున పడ్డారు.

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపురం, ఐలాపురం తండా గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 119లో సుమారు 1200 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గిరిజనులకు అప్పట్లో కొంత భూమిని అసైన్డ్ చేయగా.. వారు ఆ భూముల్ని సాగు చేసుకున్నారు. అమీన్‌పూర్ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతూ వస్తోంది. మున్సిపాలిటీ పక్కనే ఐలాపురం, ఐలాపురం తండా గ్రామాలున్నాయి. అక్కడ గజం స్థలం ధర రూ.50 వేలపైనే ఉంది. గిరిజనులు తమకు అసైన్డ్ చేసిన భూముల్ని కుటుంబ ఆర్థిక అవసరాలు బాగలేక పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం అమ్ముకున్నారు. వాటిని కొందరు రియల్టర్లు ప్లాట్లుగా చేసి విక్రయించారు. ఎనిమిదేళ్లుగా ఆ రెండు గ్రామ పంచాయతీల పరిధిలో ప్లాట్ల విక్రయాలు కొనసాగుతున్నాయి. మొదట్లో గజం ధర రూ.రెండు వేలుండేది. ఇప్పుడు రూ.పది వేలైంది. ఎపి, తెలంగాణకు చెందిన పలు జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వలసలొచ్చి బతుకుతున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లు, చిరువ్యాపారాలు, కంపెనీలు, ఇళ్లల్లో పనిచేసే వాళ్లు అక్కడ తగ్గువకే స్థలం వస్తుందన్న ఆశతో ఇంటి స్థలం కొనుగోలు చేశారు. చాలా ఏళ్ల పాటు ఎవరూ అభ్యంతరం తెలపలేదు. దాంతో వారంతా సొంత ఇళ్లను నిర్మించుకున్నారు. ఇళ్లు కట్టుకున్న వారిలో 60 శాతం మంది పాలమూరు ప్రాంతానికి చెందిన పేదలే ఉన్నారు.

చీకట్లో ఇళ్లు నేలమట్టం

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఎ శరత్ ఆదేశాల మేరకు అమీన్‌పూర్ తహసీల్దార్ దశరథతో పాటు మరో పది మంది తహసీల్దార్లు, పోలీసులు శనివారం రాత్రి జెసిబి, ఇటాచీలను పెట్టి పేదలు కట్టుకున్న ఇళ్లను కూల్చి వేశారు. ఎలాంటి నోటీసులు, ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ఇళ్లను కూల్చివేయడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఐలాపురం రోడ్డు వైపున ఉన్న ఇళ్లన్నీ ప్రస్తుతం నేలమట్టమయ్యాయి. ఐలాపురం తండాలో ఇళ్లు కట్టుకున్న నిరుపేదల్లో. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఆటో, క్యాబ్, ఇతర వాహన డ్రైవర్లు ఉన్నారు. వారి సొంత ఊర్లో ఉన్న భూములు ప్రాజెక్టు కింద ముంపునకు పోవడంతో ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం డబ్బులు తెచ్చి ప్లాట్లుకొని ఇళ్లు కట్టుకున్నారు. వాళ్ల ఇళ్లను నేలమట్టం చేసే సరికి గుండెలవిసేలా రోధిస్తున్నారు.

ఎనిమిదేళ్లుగా అందరికీ తెలిసే జరుగుతుంది

ఐలాపురం, ఐలాపురం తండా గ్రామ పంచాయతీల్లో అసైన్డ్ భూముల్ని వెంచర్లు చేసి అమ్ముతున్న విషయం అందరికీ తెలుసు. స్థానిక గ్రామపంచాయతీ సర్పంచ్‌లు, అధికార పార్టీ నాయకులు ముందుండి గిరిజన రైతుల భూముల్ని అమ్మిచ్చారు. మధ్యవర్తులు రియల్టర్లుగా మారి వివిధ ప్రాంతాల నుంచి వలసొచ్చి బతుకుతున్న పేదలను నమ్మించి తక్కువ ధరకే ఇస్తున్నామంటూ కట్టబెట్టారు. పట్టా భూములు గజం ధర రూ.50 వేలు ఉండగా అసైన్డ్ భూముల్లో పది వేలకే వస్తుందన్న ఆశతో పేదలు కష్టపడి పోగేసుకున్న సొమ్ముతో ప్లాట్లు కొన్నారు. భూములు మావే అంటూ రైతులు, మేం అండగా ఉంటాం ఎవరూ రారని చెప్పి స్థానిక నాయకులను నమ్మించి ప్లాట్లను కట్టబెట్టారు. విఆర్ఒ, విఆర్ఎలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అసైన్డ్ భూముల అమ్మకాలు జరుగుతుంటే ఏనాడు అడ్డుకోలేదు. ప్రజలకు అవగహన కల్పించలేదు. సర్పంచ్, ఎంపిటిసి, ఎంపిపి, జెడ్‌పిటిసి, ఎమ్మెల్యే వరకు ప్రజా ప్రతినిధుల సహాకారంతోనే ప్లాట్ల క్రయవిక్రయాలు జరిగాయి.

అసైన్డ్ భూమైతే అనుమతులెట్లిచ్చింద్రు

అసైన్డ్ భూముల్లో ఇళ్లు కట్టుకోవడం నేరమని అధికారులు ఇళ్లు కూల్చివేశారు. ఏనిమిదేళ్లుగా ప్లాట్ల కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఆర్థిక స్థోమతను బట్టి ప్లాట్లు కొని కొందరు ఇళ్లు కట్టుకుంటూ వచ్చారు. రెండు గ్రామ పంచాయతీల్లో అసైన్డ్ భూముల్లో పేదలు కట్టుకున్న ఇళ్లకు గ్రామ పంచాయతీ నుంచి ఇంటి నెంబర్ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి పంచాయతీ రికార్డుల్లో పేరు నమోదు చేశారు. అట్టి నెంబర్‌తో ఇంటి పన్నులు కూడా చెల్లిస్తున్నారు. కొందరు ఇటీవలే ఇళ్లు కట్టుకుని ఇంటి నెంబర్ కోసం దరఖాస్తు చేశారు. ఇల్లు కట్టుకుని కరెంట్ కోసం దరఖాస్తు చేసుకుంటే విద్యుత్ శాఖ అధికారులు ఐలాపురం తండాలో ట్రాన్స్‌ఫార్మర్ వేశారు. కరెంట్ స్థంబాలు నాటి విద్యుత్ లైన్ వేశారు. ఇండ్లకు మీటర్లు పెట్టి కరెంట్ సరఫరా చేస్తున్నారు. కాలనీలో రోడ్లు వేసింద్రు. కాలనీ వాసులు గుడి నిర్మాణం చేసుకుంటే ఆ పనులకు ఎమ్మెల్యే సోదరుడు, సర్పంచ్, ఇతర ప్రజా ప్రతినిధులు శంకుస్థాపన చేశారు.

59 జిఒ కింద క్రమబద్ధీకరణ చేయాలి:
నర్సింహ, బాధితుడు, ఐలాపురం తండా

ప్రభుత్వం 59 జిఒ కింద తమ ప్లాట్లను కూడా క్రమబద్ధీకరణ చేయాలి. ప్రభుత్వ భూమిలో ఇల్లు కట్టుకుంటే నామినల్ ఫీజుతో రెగ్యులర్ చేస్తున్న ప్రభుత్వం తమ ఇండ్లను మాత్రం ఎందుకు కూల్చి వేస్తుంది. నిరుపేదలమైన తాము తక్కువ ధరకు ప్లాట్లు ఇస్తుంటే కొనుగోలు చేశాం. అప్పులు చేసి ఇళ్లు కట్టుకున్నం. అర్ధరాత్రి వచ్చి కూలగొట్టి రోడ్డున పడేసింద్రు. మాకు కోర్టు వివాదాలు తెల్వదు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలి. వందల కుటుంబాలు వీధిన పడ్డాయి. జీవితాంతం కష్టపడి పోగేసిన సొమ్ముతో కట్టిన ఇంటిని నేలపాలు చేసింద్రు. మా కుటుంబాలు బతికేదెట్ల. అప్పుడే వద్దని చెబితే మేం కొనేవాళ్లం కాదు. ఇళ్లు కట్టుకునేటప్పుడూ ఎవరూ ఆపలేదు.

ఎటువంటి అనుమతుల్లేవు

ఐలాపూర్, తండా భూములు కోర్టు పరిధిలో ఉన్నాయి. అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేయడానికి వీల్లేదు. అక్రమ లేవుట్లలో ప్లాట్లు కొని ప్రజలు ఇబ్బంది పడొద్దు. వివాదాస్పద భూముల్లో ఎలాంటి అనుమతుల్లేకుండా నిర్మాణాలు చేస్తే చర్యలు తీసుకుంటాం. **- దశరథ, తహసీల్దార్, అమీన్‌పూర్.**



మన్మథ శతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

హాస్య రస ప్రధానం మన్మథ శతకం

ప్రజాశక్తి-కల్చరల్

శంకరనారాయణ రచనలు సాధారణంగా వ్యంగంతోకూడి సామాజిక అంశాలు ప్రాధాన్యంగా వుంటాయని ఆ వరసలోనే మన్మథ శతకం హాస్య రస ప్రధానంగా ఉందని సిబిఐ న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతీ శర్మ అన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళావేదికపై గాన సభ నిర్వహణలో ప్రముఖ హాస్యఅవధాని శంకరనారాయణ రచించిన మన్మథ శతకం అవిష్కరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా జస్టిస్ నాగమారుతీ శర్మ పాల్గొని సంపుటిని అవిష్కరించి మాట్లాడారు. శివ పార్వతులు వివాహానికి మన్మథుని బాణాలు కారణమని పురాణ గాథ ఆ గాధను శృంగార వ్యంగాత్మకంగా నేటి సమాజనికి పోలుస్తూ మన్మథ శతకం రాసారని వివరించారు. సాహిత్యం సామాజిక ప్రయోజనం కోసమని నమ్మి రచనలు చేస్తున్న శంకర నారాయణ అభినందనీయులని అన్నారు. అధ్యక్షత వహించిన గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ రచయితగా అవధానిగా జర్నలిస్ట్‌గా శంకర నారాయణ ప్రసిద్ధులు అని ప్రశంసించారు. వేదికపై కవి శంకరనారాయణ తన శతకంను లాంఛనంగా రామారావు విశ్వేశ్వరరావుకు అంకితమిచ్చారు. గాయని శ్రీమణి పాల్గొన్నారు

సామాజిక సేవకు పదవులు ప్రధానం కాదు

బలగం సినీనటులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - కల్చరల్

సామాజిక సేవకు పదవులు ప్రధానం కాదని సేవా దృక్పథం ముఖ్యమని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. చిక్క దేవదాసు ఎట్టి ఫలితం ఆశించకుండా సామాజిక ప్రత్యేకించి చేనేత కార్మికుల శ్రేయస్సు కోసం కృషి చేస్తున్నారని ప్రశంసించారు. శ్రీత్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదికపై చేనేత కార్మికుల జాతీయ నాయకుడు చిక్క దేవదాసు జన్మ దిన సందర్భంగా కళా నిలయం ప్రముఖ సాంస్కృతిక సంస్థ, ఓంకార సత్సంగ్ నిర్వహణలో ఆయనకు భారత సేవా ప్రపూర్ణ బిరుదు ప్రదానోత్సవం సభ జరిగింది. ముఖ్యఅతిథిగా శ్రీనివాస్ గుప్తా పాల్గొని దేవదాసును సత్కరించి మాట్లాడారు. దేవదాసు ఆధ్యాత్మిక భావాలు కల సామాజిక కార్యకర్త ఉత్తమ రచయితా అని గుర్తుచేశారు. సంఖ్యా శాస్త్ర వేత్త దైవజ్ఞ శర్మ అధ్యక్షత వహించిన సభలో విశ్రాంత న్యాయ మూర్తి బి మధు సూధన్, వంశీ రామరాజు విశ్రాంత పోలీస్ ఉన్నతాధికారి సుంకర సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బలగం సినీనటులు జి బాలు, ఆంజి , సురభి వాణీలకు సత్కారంతో పాటు వివిధ రంగ ప్రముఖులకు చిక్క దేవదాసు ప్రతిభా పురస్కారాలు బహుకరించాం

జర్నలిస్టు కాలనీ.. సిఎం ఆలోచన

- హెచ్‌యుజె ప్రతినిధి బృందంతో హోంమంత్రి

హోం మంత్రిని కలిసిన హెచ్‌యుజె-టీడబ్ల్యుజెఎఫ్ సభ్యులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ ఇండ్లు లేదా ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్‌యూజే-టీడబ్ల్యూజేఎఫ్) ప్రతినిధి బృందం హోంమంత్రి మహమూద్ అలీని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు హెచ్‌యూజే ప్రతినిధి బృందం సోమవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్‌లో హోంమంత్రిని కలిసి వినతిపత్రం అందజేసింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో జర్నలిస్టులకు ప్రభుత్వం స్థానికంగా ఇండ్ల స్థలాలు మంజూరు చేస్తోందని, హైదరాబాద్ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకూ ఇండ్ల స్థలాలు లేదా ఇండ్లు మంజూరు చేయాలని ప్రతినిధులు కోరారు. జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇస్తామని సిఎం కెసిఆర్ ఇప్పటికే పలుమార్లు ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రికి గుర్తు చేశారు. దీనిపై హోంమంత్రి స్పందిస్తూ.. అన్ని వర్గాల ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల కేటాయింపు తమ దృష్టిలో ఉన్నదన్నారు. హైదరాబాద్‌లో జర్నలిస్టు కాలనీ నిర్మించాలని సిఎం కెసిఆర్ ఆలోచనలో ఉన్నదని చెప్పారు. జర్నలిస్టుల ఇండ్ల కేటాయింపు అంశంపై ముఖ్యమంత్రితో మాట్లాడి త్వరగా నిర్ణయం తీసుకునేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. హోంమంత్రిని కలిసిన వారిలో హెచ్‌యూజే అధ్యక్షులు బి.అరుణ్ కుమార్, కార్యదర్శి బి.జగదీశ్వర్, కోశాధికారి బి.రాజశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గంద్ర నవీన్, హెచ్‌యూజే ఆఫీస్ బేరర్లు క్రాంతి, లక్ష్మణ్ రావు, ఎస్.రమేష్, టీడబ్ల్యూజేఎఫ్ కార్యదర్శి కొప్పు నిరంజన్, సీనియర్ జర్నలిస్టు శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

మండుటెండలు

- చాలాప్రాంతాల్లో 45 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రతలు
- వచ్చే ఐదు రోజులు అప్రమత్తంగా ఉండాల్సిందే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భానుడి ప్రతాపంతో ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తీవ్ర ఉక్కపోత ఉండటంతో వాతావరణ శాఖ చెబుతున్నదానికంటే ఒకటెండ్రు డిగ్రీల ఎండ ఎక్కువే ఉన్న భావన కలుగుతోంది. సోమవారం నాడు నల్లగొండ జిల్లా దామరచర్లలో అత్యధికంగా 45.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. రాబోయే ఐదు రోజుల పాటు ఉష్ణోగ్రతలు ఇదే రీతిలో ఉంటాయని, కొన్ని ప్రాంతాల్లో రెండు, మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం కూడా ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉష్ణోగ్రత 45 డిగ్రీలు దాటడంతో మధ్యాహ్నం పూట వేడిగాల్పులు వీస్తున్నాయి. వీటి తీవ్రత క్రమంగా పెరిగే అవకాశముంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని సింగరేణి కోల్ బెల్ట్ ఏరియాల్లో ఎండలు ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో అత్యవసరమైతే గానీ పనుల మీద బయటకు వెళ్లొద్దనీ, చిన్నపిల్లలు, వృద్ధులు విషయంలో ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి. ఓవైపు విపరీతమైన ఎండలు, మరోవైపు తీవ్ర ఉక్కపోతతో వడదెబ్బ కేసులు పెరుగుతున్నాయి. మంచిర్యాల జిల్లాలో ఓ కానిస్టేబుల్ వడదెబ్బతో చనిపోయారు.

చిచ్చుపెట్టే రాజకీయాలు చాలాకాలం ఉండవు

- మల్లు రవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజల మధ్య చిచ్చు పెట్టే రాజకీయాలు చాలా కాలం ఉండవని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. పేరుకే ఏక్తా యాత్ర అనీ, అది హిందువులను విడగొట్టేలా బిజెపి అధ్యక్షులు బండి సంజయ్ యాత్ర ఉందని విమర్శించారు. ఇలాంటి వారికి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ప్రమాదమేమి లేదు...

హిందూమతానికి వచ్చిన ప్రమాదమేమి లేదని పిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు జి.నిరంజన్ స్పష్టం చేశారు. హిందూ ఏక్తా యాత్రలో అస్సాం సిఎం హిమంత బిశ్వ శర్మ, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు బండి సంజయ్ మాట్లాడిన మాటలు వాస్తవ విరుద్ధమని ఖండించారు. సనాతన ధర్మం గొప్పతనాన్ని ప్రపంచం ఏనాడో గుర్తించిందని తెలిపారు.

మతం పేరుతో రెచ్చగొడుతోన్న మోడీ

- హుస్నాబాద్‌లో సిపిఐ జెండా ఎగరాలి
- సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రధాని పదవిలో ఉన్న మోడీ కర్ణాటక ఎన్నికల ప్రచారంలో జై భజరంగబలి అనడం సిగ్గుచేటని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. లౌకిక తత్వానికి కట్టుబడతానని రాజ్యాంగంపై ప్రమాణం చేసిన మోడీ.. ఇప్పుడు మతం పేరుతో తాత్కాలికంగా జనాన్ని రెచ్చగొట్టి ఓట్లు వేయించుకుని అధికారంలోకి రావచ్చేమో కానీ అట్లాంటి అడ్డగోలు గడ్డి తినాల్సిన అవసరం కమ్యూనిస్టులకు లేదని చెప్పారు.

సిద్దిపేట జిల్లా మండల కేంద్రమైన హుస్నాబాద్‌లో సోమవారం రాత్రి జరిగిన సిపిఐ బహిరంగ సభలో వారు మాట్లాడారు. బిజెపి అండతోనే దేశంలో కుబేరులు నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకుంటున్నారని విమర్శించారు. జిఎస్‌టిలో కార్పొరేట్ వాళ్లకు పన్నులు తగ్గించి, సామాన్యులు వాడే వస్తువులపై పన్నుల శాతాన్ని పెంచారన్నారు. పెండ్లి చేసుకొని భార్యను వదిలేసిన ప్రధాని మోడీకి దేశంలో 30 మంది దత్తపుత్రులున్నారని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ నుంచి రాహుల్ గాంధీని అన్యాయంగా తొలగిస్తే.. కర్ణాటకలో ప్రజలు మోడీని తరలించారన్నారు. గాంధీని చంపిన గాడ్సే నోటి నుంచి వచ్చినవారు మోడీ.. అలాంటి మోడీ పాలనలో దేశమంతా ముక్క చెక్కలు అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముగ్గురు మహిళలు కనిపించకుండా పోయారని కేరళపై సినిమా తీయించారు.. కానీ 46 వేల మంది గుజరాత్‌లో కనబడకుండా పోయినా ఏమీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మన్ కీ బాత్‌లో మోడీ వంద అబద్ధాలు ఆడుతున్నారని, దేశాన్ని కాపాడుకోవాలంటే మోడీ ఇంటికి పోవాల్సిందేనని అన్నారు.

బహిరంగ సభలో మాట్లాడుతున్న నారాయణ

భూస్వాములకు న్యాయం చేయడానికే ముఖ్యమంత్రి కేసీఆర్ ధరణి పోర్టల్ తీసుకువచ్చారన్నారు. రాష్ట్రంలో ఉన్న సమస్యలను గాలికి వదిలేసి, కేవలం మోడీపై పోరాడుతున్నామన్న సిఎం కెసిఆర్ వైఖరి సరికాదన్నారు. దేశంలోని బిజెపి వ్యతిరేక శక్తులను సమైక్యపరిచి, కార్యాచరణ రూపొందించాలన్నారు. మనిషి కోసం.. మనిషి బాగుండాలని కోరుకునే సిద్ధాంతం కమ్యూనిజానిదని చెప్పారు. అధికారంలో లేకపోయినా కేంద్రంలో, రాష్ట్రంలో వచ్చిన ప్రతి హక్కు, ప్రతి చట్టం, భూసంస్కరణలు, సింగరేణి ఏవైనా సరే కమ్యూనిస్టుల వల్లనే వచ్చాయని తెలిపారు. దౌర్జన్యాలను సహించని వారెవరైనా కమ్యూనిస్టు అవుతాడన్నారు. ఆకలి దప్పులు లేని, అసమానతలు లేని మరో ప్రపంచం మనకోసం ఉందన్నారు. ఈసారి హుస్నాబాద్‌లో ఖచ్చితంగా సిపిఐ జెండా ఎగరాలని ఆకాంక్షించారు.

'నెట్టింట' బెట్టింగ్ పంట

- బిన్ని, షా హయాంలో ఆన్‌లైన్ క్రికెట్ యాప్‌ల జోరు
- ఐపిఎల్ 16వ సీజన్‌లో భారీగా దందా
- రూ.కోట్లలో దండుకుంటున్న బెట్టింగ్ సంస్థలు
- లోకల్ బెట్టింగ్ రాయుళ్లపై పోలీసు పంజా
- మెట్రోసిటీల బుకీలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి బెట్టింగ్
- అప్పుచేసి మరీ యువత జూదం..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిసిఐ ప్రెసిడెంట్‌గా రోజర్ బిన్ని, సెక్రటరీగా హోంమంత్రి అమిత్ షా కుమారుడు జై షా బాధ్యతలు స్వీకరించాక ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) 16వ సీజన్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల పంట పండుతోంది. ఇదో వ్యసనంలా రూ. కోట్లలో బెట్టింగ్‌లకు పాల్పడుతూ యువత గుల్లవుతోంది. చివరికి మహిళలు సైతం బెట్టింగ్ ఊబిలో కూరుకుపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఆఫ్‌లైన్ బెట్టింగ్‌రాయుళ్లపై పోలీసు నిఘా ఉన్నా ఆన్‌లైన్ యాప్‌లపై ఎలాంటి నియంత్రణ లేకపోవడంతో యువత చిత్తవుతున్నారు. రూ.లక్షల్లో అప్పులు తెచ్చి మరీ ఈ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. పైగా ఈ యాప్‌లను ప్రముఖ క్రికెటర్లు ప్రమోట్ చేస్తుండటంతో వెర్రి వ్యామోహంతో యూత్ కొట్టుకుపోతుంది. యుపిఐ, జి పే, ఫోన్ పే, పేటిఎం, వీసా, మాస్టర్ కార్డు.. ద్వారా డిజిటల్ బెట్టింగ్ లావాదేవీలు కొనసాగించే అవకాశం ఉండటంతో బెట్టింగ్ మోజులో పడి యూత్ లూటీ అవుతోంది. ఖమ్మం నుంచి ముంబయి, ఢిల్లీ, హైదరాబాద్, విజయవాడ కేంద్రాలుగా బెట్టింగ్ సాగుతోంది.

బెట్టింగ్ యాప్‌ల జోరు

గెట్ బోనస్ పేరుతో అనేక యాప్‌లు పుట్టుకొచ్చాయి. ఒకింత బెట్టింగ్ పెట్టి.. మూడింతలు సంపాదించొచ్చనే ప్రచారంతో ఆకట్టుకుంటున్నాయి. 10 క్రిక్, 7 క్రిక్, ప్లే స్ట్యేయిర్, లీఆన్, కాసినో డేస్, క్రిక్‌బాబా, 4 రాబెట్, విన్‌డాడీ, రాజా బెట్స్, మెగా పారీ, 22 బెట్, బ్లూ చిప్, బెట్ టిల్ట్, బెట్ వే, పారీ మ్యాచ్, 1ఎక్స్‌బెట్, బెట్ 818, గురుబాయ్, డ్రీమ్ 11.. ఇవే కాదు ఇంకా వందల సంస్థలు రకరకాల బెట్టింగ్ ఆఫర్లతో యూత్‌ను మాయచేసి దోచేస్తున్నాయి. రోజువారీ కూలి పనిచేసుకునే యువత మొదలు ప్రభుత్వ, ప్రయివేటు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల వరకు ఈ బెట్టింగ్ మాయాలో పడి డబ్బులు పోగొట్టుకుంటున్నారు. చైన్‌సిస్టమ్ ద్వారా ఒకరి నుంచి మరొకరు ఐడీలు తీసుకుని బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. ఇవన్నీ అధికారిక బెట్టింగ్ సంస్థలు కావడంతో యువత ఈ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించుకొని రూ. వంద నుంచి రూ.లక్షల వరకు కోల్పోతున్నారు.

బురిడీ కొట్టిస్తున్న బుకీలు

ముఖ్యంగా బెట్టింగ్‌లో బుకీల మాయాజాలం కొనసాగుతోంది. బాల్ బాల్‌కు బెట్టింగ్.. మ్యాచ్ ఎవరు గెలుస్తారు..? ఏ బ్యాట్స్‌మెన్ ఎన్ని పరుగులు చేస్తాడు..? ఏ బౌలర్ ఎన్ని వికెట్లు పడగొడతాడు..? ఏ ఓవర్‌లో వికెట్ పడుతుంది..? మొదట బ్యాటింగ్ జట్టు ఎన్ని పరుగులు చేస్తుంది..? ఇలా ఒకటేమిటి ఒక్క మ్యాచ్‌కు సంబంధించే అనేక రకాలుగా బెట్టింగ్ తంతు కొనసాగుతోంది. ఇంజినీరింగ్, డిగ్రీ, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు రూపాయికి పది రూపాయలు ఇస్తామని చెప్పి బెట్టింగ్ ఊబిలోకి దించుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత పొద్దస్తమానం కష్టపడి సాయంత్రమైతే చాలు బెట్టింగ్ వైపు చూస్తోంది.

ఆన్‌లైన్‌లో పరిచయమైన, ఫ్రెండ్స్ ద్వారా తెలిసిన బుకీలు.. మొబైల్ నంబర్‌లకు ఫోన్లు చేసి ఆ రోజు గేమ్ స్వరూపంపై విశ్లేషణ చేసి బెట్టింగ్‌కు దించుతున్నారు. ఖమ్మం, కొత్తగూడెంలకు రాజస్థాన్, గుజరాత్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చి హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్ తదితర షాపులు నిర్వహిస్తున్న యువతను ఎక్కువగా బెట్టింగ్‌లకు ప్రేరేపిస్తూ.. వారూ ప్రేరేపితులవుతున్నట్టు తెలుస్తోంది. బెట్టింగ్‌లో అనుభవజ్ఞులైన కొందరికి వీరే తొలుత పెట్టుబడి పెడుతున్నారని సమాచారం. రూ.50 వేలు, రూ.లక్ష వరకు బెట్టింగ్‌కు పాల్పడే వ్యక్తి సామర్థ్యానికి అనుగుణంగా ముందస్తు అప్పులు ఇస్తున్నారని తెలిసింది. బెట్టింగ్‌కు పాల్పడిన వ్యక్తి ఆ రోజు మ్యాచ్‌కు రూ.5వేల బెట్టింగ్ పెట్టి రూ.పది వేల వరకు రాబడితే దానిలో ఫిఫ్టీ ఫిఫ్టీ ప్రాతిపదికన వీరు ముందస్తు పెట్టుబడి పెడుతున్నట్లు సమాచారం. నిర్ణీత రూ.50 వేలు, రూ.లక్ష మించితే మాత్రం ఆ తర్వాత సొమ్మును వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంటుంది. ఇలాంటి ఒప్పందాల కారణంగా స్థానిక యువత అప్పుల పాలవుతున్నట్టు సమాచారం.

నెట్టింటే సర్వం...!

శాస్త్రసాంకేతికంగా అభివృద్ధి చెందిన దృష్ట్యా గడిచిన కొన్నేండ్లుగా ఆన్‌లైన్‌లోనే సర్వం కానిచ్చేస్తున్నారు. ఒకప్పుడు సంపన్న వర్గాలకే పరిమితమైన ఈ బెట్టింగ్ వ్యసనం ఇప్పుడు పేద, మధ్యతరగతి వర్గాలకూ పాకింది. రోజు కూలీ రూ. 300 నుంచి 500 వరకు సంపాదించే సామాన్యుడు కూడా ఈ రొంపిలో చిక్కుకున్నాడు. రూ. వందకు వెయ్యి... వెయ్యికి పదివేలు అనే బుకీల మాయ మాటలకు ప్రలోభ పడి అప్పుల పాలవుతున్నారు. స్నేహితులు, వడ్డీ వ్యాపారస్తులు, ఆన్‌లైన్ యాప్‌ల్లో అప్పులు తీసుకుని బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఉదంతాలున్నాయి. ఖమ్మంలోని కమాన్‌బజార్, కస్బాబజార్‌లోని పలు దుకాణాల్లో పనిచేస్తున్న సేల్స్ గర్ల్స్, కొత్తగూడెం, ఇల్లెందు సింగరేణి పారిశ్రామిక ప్రాంతాల్లోని మహిళలు కొందరు బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్టు సమాచారం.

గల్లీ నుంచి ఢిల్లీకి పాకిన దందా...

ప్రపంచంలోనే అత్యంత కాస్ట్లీ క్రికెట్‌గా పేరొందిన ఐపిఎల్ ఆటగాళ్లకు.. ఫ్రాంఛైజీలకు కాసుల వర్షం కురిపిస్తుండగా టెకీ (జూదగాడు)ల పాలిట శాపంగా మారింది. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఇది పాకింది. ఎక్కడో ముంబై, ఢిల్లీ, పుణెలాంటి రాష్ట్రాల్లో కూర్చుని మన రెండు తెలుగు రాష్ట్రాల్లోని వారితో ఫోన్‌లో సంభాషిస్తూ రూ. కోట్లలో గుట్టు చప్పుడు కాకుండా ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ల ద్వారా బుకీలు కాజేస్తున్నారు. బెట్టింగ్ ద్వారా బుకీలు దోచుకోవడం తప్ప ఒక్కరూ సంపాదించింది లేదు.

యాప్‌లను నియంత్రించలేం..
వై వెంకటేశ్వర్లు, టాస్క్‌ఫోర్స్ ఎసిపి, ఖమ్మం

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్ ఏదైనా నిఘా పెడుతున్నాం. మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటున్నాం. అయితే బెట్టింగ్ యాప్‌లపై పోలీసు నియంత్రణ ఏమీ ఉండదు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా పరిధిలో ఇవి ఉంటాయి కాబట్టి మేము ఏమీ చేయలేం.